జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
25 మంగళవారం, ఆగస్టు 2026 పేజీలు:14











## రవాణా సౌకర్యాల పై ప్రత్యేక దృష్టి

- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు




# అంగన్వాడీ కేంద్రాల్లో సమయ పాలన ఏది?

## మహమ్మదాబాద్ మండలం లో అన్ని అంగన్వాడీ ల్లో ఇదే పరిస్థితి రక రకాల కారణాలు చేబుతున్న టీచర్లు......

## ఇబ్బంది పడుతున్న చిన్నారులు, తల్లి దండ్రులు

**మహమ్మదాబాద్ ఆగష్టు 24(ప్రజా జ్యోతి )**

మహమ్మదాబాద్ మండలం లోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో సమయ పాలన సక్రమంగా అమలు కావడం లేదని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్ణీత సమయానికి కేంద్రాలు కేంద్రాలు సమయానికి తెరవక పోవడం తో చిన్నారులు, తల్లి దండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు చెబుతున్నారు.కొన్ని కేంద్రాల్లో సిబ్బంది సమయానికి రాక పోవడం, వివిధ కారణాల వల్ల కేంద్రాలు సమయానికి తెరవలేకపోతున్నామని టీచర్లు చేబుతున్నట్లు తెలుస్తోంది. అయితే అంగన్వాడీ సెంటర్లు అంగన్వాడీ కేంద్రల నిర్వహణ లో సమయం కీలకమని, చిన్నారులకు పౌష్టికాహారం, ఇతర సేవలు నిర్ణీత సమయం లో అందాల్సి ఉంటుందని తల్లి దండ్రులు అభిప్రాయపడ్తున్నారు.కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభమై త్వరగా ముగుస్తున్నాయనే పిర్యాదులపై అంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవ పరిస్థితితులను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.ఖ

# 40 ఏళ్లుగా ఇదే గోడు.. ఇకనైనా ఉద్యోగాలివ్వండి!




- చిన్నంబావి ప్రజావాణికి పోటెత్తిన శ్రీశైలం నిర్వాసితులు
- 98 జీఓ అమలు చేయాలని భారీగా దరఖాస్తులు.. 2 వేల ఉద్యోగాలు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన
- సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్

**చిన్నంబావి, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)**

శ్రీశైలం ప్రాజెక్టు కోసం సర్వస్వం కోల్పోయి నాలుగు దశాబ్దాలుగా న్యాయం కోసం ఎదురుచూస్తున్న నిర్వాసితులు మరోసారి గళమెత్తారు. 98 జీఓను అమలు చేసి అర్హులైన నిర్వాసితులకు ఉద్యోగాలు, నష్టపరిహారం, పునరావాస ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం చిన్నంబావి మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణికి భారీగా తరలివచ్చారు. వందలాది మంది నిర్వాసితులు తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించడంతో ఎంపీడీవో కార్యాలయం కిక్కిరిసిపోయింది.

### నాలుగు దశాబ్దాలుగా ఎదురుచూపులే..

శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంతో 1980లో సర్వస్వం కోల్పోయామని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి నుంచి ప్రభుత్వాలు మారుతున్నా తమ బతుకులు మాత్రం మారడం లేదని మండిపడ్డారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులను కలిసి సమస్యను వివరించినా ఇప్పటివరకు పూర్తిస్థాయి పరిష్కారం లభించలేదన్నారు.

### 98 జీఓ అమలు ఏది?

98 జీఓ కింద తమకు దక్కాల్సిన హక్కులు, ఉద్యోగాలు, పునరావాస ప్రయోజనాలను వెంటనే కల్పించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. గతంలో కేవలం 180 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, ఇంకా దాదాపు 2 వేల ఉద్యోగాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మిగిలిన అర్హులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని, మరణించిన నిర్వాసితుల కుటుంబాల్లో వారసులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

### ప్రజావాణికి వెల్లువలా దరఖాస్తులు

మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడంతో నిర్వాసితులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఎంపీడీవో ఆదర్శ్‌గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్‌కు తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రాలు అందజేశారు. దరఖాస్తులను స్వీకరించిన అధికారులు వాటిని పరిశీలించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### 'సీఎం హామీ ఏమైంది?'

జటప్రోల్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వాసితుల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని నిర్వాసితులు గుర్తుచేశారు. ఇన్‌చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎంపీ మల్లు రవి ప్రత్యేకంగా ఈ సమస్యపై దృష్టి సారించాలని సీఎం సూచించినప్పటికీ ఏడాది దాటుతున్నా ఉద్యోగాలపై ఎలాంటి స్పష్టత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

### 'మా త్యాగాలకు గుర్తింపు ఎక్కడ?'

'రాష్ట్రానికి వెలుగులు ఇచ్చేందుకు మా భూములను త్యాగం చేశాం.. కానీ మా కుటుంబాలు మాత్రం చీకట్లోనే మగ్గుతున్నాయి' అని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. వనపర్తి, నాగర్‌కర్నూల్, అలంపూర్ ప్రాంతాల్లోని ముంపు గ్రామాల ప్రజలు దశాబ్దాలుగా సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. 67 ముంపు గ్రామాల నిర్వాసితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం ప్రత్యేక నిర్ణయం తీసుకోవాలని కోరారు.

### మంత్రులు చొరవ చూపాలి

మంత్రి జూపల్లి కృష్ణారావు నిర్వాసితుల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. 98 జీఓను పూర్తిస్థాయిలో అమలు చేసి ఉద్యోగాలు, నష్టపరిహారం, ఇతర హక్కులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. 'ఇక హామీలు కాదు.. అమలు కావాలి' అని నిర్వాసితులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నిర్వాసితుల కమిటీ సభ్యులు డాగోజీరావు, ఎస్. శ్రీనివాసులు, బెక్కెం కాంతాయ, గూడెం శాంతయ్య, చిన్న మద్దిలేటి, కృష్ణయ్య, రాఘవేంద్రశెట్టి, ఎండీ జహంగీర్‌భాషా, సత్యనారాయణ, ఉత్తరాన గౌడ్, చెల్లెపాడు నరసింహ, టి. నరసింహ, నాగరాజు, జి. వెంకటరాముడు, ఆనంద్, వెల్టూర్ నటరాజ్, ఎం. సతీష్‌యాదవ్, గూడెం వెంకటస్వామి, శేఖర్, రమేష్‌సింగ్, నాగేంద్ర, రామదాస్, టి. కురుమయ్య, ఎండీ మహబూబ్, లక్ష్మయ్య, మౌలాలి, గడ్డం నరసింహ, గడ్డం మద్దిలేటి, కే. స్వాములయ్య, కాసిమ్, చిరంజీవి, ఎం. వెంకటయ్య, కాశన్న, రాజు, దామోదర్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకే లే అవుట్లకు అనుమతులు జారీ- జిల్లా కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 24( ప్రజా జ్యోతి)**

ప్రభుత్వ నిబంధనలను అనుసరించి లే అవుట్లకు అనుమతులు మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా లే అవుట్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లే అవుట్ల అనుమతుల జారీ విషయంలో అధికారులు అన్ని నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించి, పూర్తి స్థాయి జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కమిటీ పరిశీలనకు వచ్చిన జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సంబంధించిన 6 లే అవుట్ దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారుల క్లియరెన్స్ వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు.కమిటీ పరిశీలన అనంతరం 3 లే అవుట్లకు అనుమతులు మంజూరు చేయగా, మరో 3 లే అవుట్ల దరఖాస్తులను తిరస్కరించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...లే అవుట్ అనుమతుల జారీ ప్రక్రియలో ఆన్‌లైన్ విధానం తీసుకురావడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం ప్రక్రియను సులభతరం చేయడం, సమయాన్ని తగ్గించడం, అనవసరమైన భౌతిక సమావేశాలను నివారించడమేనని కలెక్టర్ తెలిపారు.ఆన్‌లైన్‌లో పరిశీలన పూర్తయిన తర్వాత కూడా ప్రతి దరఖాస్తుకు మళ్లీ భౌతిక సమావేశం నిర్వహిస్తే ప్రక్రియ రెట్టింపు అవుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్ వెరిఫికేషన్ సమయంలో ఏదైనా అధికారి లేదా కమిటీ సభ్యుడు అభ్యంతరం వ్యక్తం చేస్తే, ఆ అభ్యంతరాన్ని సిస్టమ్‌లోనే నమోదు చేసే విధానం ఉండాలని సూచించారు.అభ్యంతరం నమోదైన సందర్భంలో సంబంధిత ఫైల్‌ను తదుపరి స్థాయికి ఆటోమేటిక్‌గా పంపించేలా ప్రక్రియను రూపొందించవచ్చని తెలిపారు. అన్ని శాఖల అధికారులు ఆమోదించిన దరఖాస్తులకు మళ్లీ ప్రత్యేకంగా భౌతిక సమావేశం నిర్వహించాల్సిన అవసరం లేకుండా, ఆన్‌లైన్‌లోనే తదుపరి ప్రక్రియకు ఫైల్‌ను పంపించే విధానం అమలు చేస్తే సమయం, శ్రమ రెండూ ఆదా అవుతాయని స్పష్టం చేశారు.ఏదైనా అంశంపై అభ్యంతరం ఉన్న దరఖాస్తులను మాత్రమే భౌతిక సమావేశానికి తీసుకువచ్చి చర్చించి నిర్ణయం తీసుకునే విధానం మరింత సమర్థవంతంగా ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇకపై ప్రతి లే అవుట్‌లోనూ రహదారుల ఇరువైపులా మొక్కలు నాటే నిబంధనను ఖచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణకు, లే అవుట్లలో పచ్చదనం పెంపొందించేందుకు ఈ నిబంధనను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను, పంచాయతీరాజ్ ఈఈ అశోక్, నీటిపారుదల శాఖ ఈఈ సాల్మన్, ఆర్అండ్‌బీ ఈఈ వెంకట రమణయ్య, డీటీసీపీఓ కిరణ్, కోస్గి, మక్తల్, మద్దూరు టౌన్ ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మంత్రులకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే

**నాగర్ కర్నూల్ ఆగస్టు 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పర్యటనలో భాగంగా సోమవారం వచ్చేసిన రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవికి స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ పార్టీ శ్రేణులతో కలిసి హాజీపూర్ చౌరస్తా వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పర్యటనలో భాగంగా బల్మూరు మండలానికి తరలి వెళ్లారు. మంత్రుల వెంట ఎమ్మెల్యే, స్థానిక ప్రజా ప్రతినిధులు సంబంధిత శాఖల ఉన్నత అధికారులు తదితరులు ఉన్నారు





# అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

## - ఉమామహేశ్వర ప్రాజెక్ట్ డిజైన్ను మార్చాలి

## - వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి నరసింహ డిమాండ్

**నాగర్ కర్నూల్ ఆగస్టు 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**



అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఇది ముమ్మాటికీ ఆ ప్రజాస్వామి కమనీ వ్యవసాయ జిల్లా కార్యదర్శి నరసింహ స్పష్టం చేశారు. సోమవారం ఉమామహేశ్వరం ప్రాజెక్టు డిజైన్ను తక్షణమే మార్పు చేసి సన్నా కారు రైతులను ఆదుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పీనరసింహ డిమాండ్ చేశారు. బల్మూర్ మండల పరిధిలోని అనంతవరం సమీపంలో నిర్మించబోయే ఉమామహేశ్వర ప్రాజెక్టు డిజైన్ను తక్షణమే మార్పు చేయాలని బల్మూర్ మండల కేంద్రంలో సిపిఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ మాట్లాడుతూ తక్షణమే డిజైన్ మార్పు చేసి రైతులను ఆదుకోకపోతే బాధిత రైతులను సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం పార్టీ నాయకులను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులను బాధిత రైతులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్యదర్శి సంఘం జిల్లా అధ్యక్షులు మల్లేష్, శంకర్ నాయక్ ఉప్పునుంతల శంకర్ నాయక్మండల సిపిఎం కార్యదర్శి జింకల నాగరాజు, బల్మూరు మండలం సిపిఎం నాయకులు లాల్ అహ్మద్, స్థానిక సిపిఎం గ్రామ కార్యదర్శి ఎండి బాబర్, నర్సాయపల్లి శాఖ కార్యదర్శి శ్రీ రామ్ ,శ్రావణ్ కుమార్ కృష్ణయ్య అంజి బాలరాజు విష్ణు , సి ఐ టి యు నాయకులు రాములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 24( ప్రజా జ్యోతి)**

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 14 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా సత్వరం పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డి.ఆర్.ఓ.రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.





# 27న గ్రామ, వార్డు సభలు

## ముసాయిదా ఓటర్ల జాబితా, ఏఎస్‌డీ జాబితా చదివి వినిపించాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామ, వార్డు సభల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ, వార్డు సభల్లో ముసాయిదా ఓటర్ల జాబితాతో పాటు ఏఎస్‌డీ జాబితాను బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్ల సమక్షంలో ప్రజలకు చదివి వినిపించాలని సూచించారు. సభల నిర్వహణ సమయంలో బూత్ స్థాయి అధికారుల వద్ద ఫారం-6, 7, 8 అందుబాటులో ఉంచి, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించాలని తెలిపారు.ఓటర్ల జాబితాపై ప్రజలకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని నమోదు చేసుకోవాలని, అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించిన వివరాలను బూత్ స్థాయి అధికారుల ద్వారా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని ఆదేశించారు.

**నోటీసుల పంపిణీ పూర్తి చేస్తాం:**

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలో అనామలీస్, మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించిన నోటీసుల జనరేషన్ ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. నోటీసులు అందాల్సిన ఓటర్లకు ఈ వారంలోగా వాటిని పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 27న జిల్లాలోని అన్ని గ్రామాలు, వార్డుల్లో గ్రామ, వార్డు సభలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుసూదన్ నాయక్, హరిప్రియ, ఆర్డీఓ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత బ్యాగులు,షూల పంపిణీ

**గద్వాల ఆగస్టు 24(ప్రజా జ్యోతి ప్రతినిధి):**



మల్దకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన బ్యాగులు,షూల పంపిణీ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలతారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలతారెడ్డి మాట్లాడుతూ,విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు ఉపయోగపడేలా షూలను అందజేసినట్లు తెలిపారు. అలాగే కళాశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యే విద్యార్థుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని,ప్రతిరోజూ పుస్తకాలను కళాశాలకు తీసుకురావడానికి వీలుగా నాణ్యమైన బ్యాగులను ప్రభుత్వం అందించిందన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని శారీరకంగా,మానసికంగా దృఢంగా ఎదగడంతో పాటు విద్యలో రాణించాలని ఆమె సూచించారు.కళాశాల ఉత్తీర్ణత శాతాన్ని పెంచి కళాశాలకు,తల్లిదండ్రులకు,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు బ్యాగులు,షూలను అందించినందుకు తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శికి,రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఉచిత బ్యాగులు,షూలను అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరసింహులు,రామాంజనేయులు గౌడ్,భాగ్యలక్ష్మి, గోవర్ధన్ రెడ్డి,శ్రీకాంత్,సుధాకర్,మాధురి,రంగస్వామి,కమలహాసన్,ఇఫ్తికర్‌తో పాటు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# వన మహోత్సవ లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలి

- రేపు జిల్లావ్యాప్తంగా భారీగా సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించాలి.
- మొక్కల సంరక్షణ, మనుగడపై ప్రత్యేక దృష్టి సారించాలి.
- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.





**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)**

వన మహోత్సవంలో భాగంగా జిల్లాలకు నిర్దేశించిన మొక్కలు నాటే లక్ష్యాలను సెప్టెంబర్ చివరి నాటికి పూర్తి చేసేలా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.సోమవారం, వన మహోత్సవం కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా నారాయణ పేట జిల్లా కలెక్టరేట్ లోని వీసీ నుంచి జిల్లా కలెక్టర్ ప్రియాంక ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.ఈ సందర్భంగా మంత్రి మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించగా, ఇప్పటివరకు 9.06 కోట్ల మొక్కలు నాటినట్లు తెలిపారు. రేపు వన మహోత్సవంలో భాగంగా అన్ని జిల్లాల్లో భారీ స్థాయిలో సామూహిక మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించి, ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని సూచించారు.ఇటీవల కురుస్తున్న వర్షాలు, రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ అనుకూల వాతావరణాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని, పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని మంత్రి సూచించారు. ప్రతి మండలం, గ్రామం, పట్టణ ప్రాంతానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించి, రేపటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు.అంగన్‌వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులను పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను వ్యక్తిగతంగా ఆహ్వానించి, కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు.మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ చేయాలని, మొక్కల మనుగడను ప్రతిరోజూ పర్యవేక్షించాలని, చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే కొత్త మొక్కలను నాటాలని ఆదేశించారు. నాణ్యమైన మొక్కలను మాత్రమే నాటాలని, అవసరమైన మొక్కలను సకాలంలో తరలించాలని సూచించారు.అటవీ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూములను గుర్తించి మొక్కలు నాటాలని, పట్టణ ప్రాంతాల్లో అర్బన్ ఫారెస్ట్రీని ప్రోత్సహించాలని అన్నారు. దేవాలయాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రభుత్వ సంస్థల ప్రాంగణాల్లో కూడా ప్రణాళికాబద్ధంగా మొక్కలు నాటాలని సూచించారు. బ్లాక్ ప్లాంటేషన్ ప్రాంతాల్లో నీటి సౌకర్యం కల్పించాలని, వన మహోత్సవ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించి, మీడియాను కూడా భాగస్వామ్యం చేయాలని మంత్రి ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. వన మహోత్సవ కార్యక్రమంలో జిల్లా అధికారులు అన్ని వర్గాల ప్రజలను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి, జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డి ఆర్ డి ఓ వెంకట్ రాములు, జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు, ఎస్ డీ సీ రాజేందర్ గౌడ్, అటవీ శాఖ అధికారి గణేశ్, కమలుద్దీన్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్,బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, డీ ఐ ఈ వో సుదర్శన్, మున్సిపల్ కమిషనర్ శంకర్, సంబంధిత అధికారులు పాల్గొన్నార.

## గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన టీజీ సాక్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జయలక్ష్మి



**గద్వాల ఆగస్టు 24(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ(టీజీ సాక్స్) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ జయలక్ష్మి సోమవారం సందర్శించారు.ఎన్‌ఏసీపీ ఫెసిలిటీస్‌లో భాగంగా నిర్దేశించిన మొబిలైజేషన్ ఎయిడ్స్,సురక్ష కార్యక్రమాల లక్ష్యాల సాధనలో జిల్లాలో జరుగుతున్న పురోగతిని ఆమె సమీక్షించారు.ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమంలో మూడు కీలక పారామీటర్లలో భాగంగా 1వ 95, 2వ 95 లక్ష్యాలను జోగులాంబ గద్వాల జిల్లా ఇప్పటికే సాధించిందని అధికారులు తెలిపారు.మిగిలిన 3వ, 95/99 లక్ష్య సాధనలో మరింత పురోగతి సాధించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డాక్టర్ జయలక్ష్మి సిబ్బందికి కీలక సూచనలు చేశారు.జిల్లాను నిర్దేశిత సురక్ష విభాగంలో మరింత మెరుగైన స్థాయికి తీసుకెళ్లేందుకు వచ్చే నెల రోజుల్లో ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇందుకు సంబంధించిన పారామీటర్లను వివరించి, వివిధ విభాగాల సిబ్బందికి తగిన దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ రమేష్,ఐసీటీసీ, పీపీటీసీటీ,ఎస్ఆర్‌సీ కౌన్సిలర్లు,ఎల్ఈఏస్సీ సిబ్బంది,స్టాఫ్ నర్స్,హోప్ ఎన్జీవో సిబ్బంది,సీఎస్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు మహబూబ్‌నగర్ జిల్లాలో వి. హనుమంత రావు పర్యటన

### బీసీ గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం

**మహబూబ్‌నగర్, ఆగస్టు 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ, అభివృద్ధి శాఖ ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు ఆగస్టు 25న మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. పర్యటనలో భాగంగా ఉదయం 8 గంటలకు హైదరాబాద్ అంబర్‌పేట్‌లోని తన నివాసం నుంచి బయలుదేరి, ఉదయం 11 గంటలకు మహబూబ్‌నగర్ టీచర్స్ కాలనీలోని రామ్ మందిర్‌కు చేరుకుంటారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు బీసీ గురుకుల పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు మహబూబ్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య సమావేశంలో పాల్గొంటారు. పర్యటనను ముగించుకుని సాయంత్రం 4 గంటలకు మహబూబ్‌నగర్ నుంచి బయలుదేరి, 6 గంటలకు హైదరాబాద్‌కు చేరుకుంటారు. హనుమంతరావు పర్యటనకు సంబంధించి ఆయా కార్యక్రమాల నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

# నేడు జిల్లావ్యాప్తంగా భారీగా వన మహోత్సవం

### ప్రతి గ్రామ పంచాయతీలో సామూహికంగా మొక్కలు నాటాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, ఆగస్టు 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**



వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 25న మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా భారీ ఎత్తున సామూహిక మొక్కలు నాటే వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో చేపట్టనున్న సామూహిక వన మహోత్సవం కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. మండల, నియోజకవర్గ స్థాయిల్లోనూ పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టి, ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు.

**అన్ని శాఖలు భాగస్వాములు కావాలి:**

వ్యవసాయం, విద్య, వైద్యం తదితర అన్ని ప్రభుత్వ శాఖలు తమ పరిధిలో క్షేత్రస్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో ప్రతి శాఖ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలు, పూర్తి వివరాలను జిల్లా స్థాయికి అందించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి సమన్వయ లోపాలు తలెత్తకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంరెడ్డి, జెడ్పీ సీఈఓ ఇన్‌చార్జి, డీపీఓ వెంకటరెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిన్నంబావి ప్రజావాణికి భారీగా ఫిర్యాదులు ఎంపీడీవో సుర్ణ అదర్స్ గౌడ్

**చిన్నంబావి. ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)**

మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి భారీగా ఫిర్యాదులు వచ్చినట్లు ఎంపీడీవో సుర్ణ ఆదర్శ గౌడ్ తెలిపారు. వాటిలో 98 జీవో శ్రీశైలం నిర్వాసితులకు సంబంధించిన, పింఛన్లకు ప్రజలు అందించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఆయన సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు నిర్ణీత సమయానికి తప్పనిసరిగా హాజరు కావాలని, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమానికి మండల ఎంపీడీవో సుర్ణ ఆదర్శ గౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్,ఎంఈఓ రామస్వామి, ఏపీఓ ధనుంజయరాజు, హెడ్ కానిస్టేబుల్ జీవన్, , వివిధ శాఖల అధికారులు, ప్రజలు శ్రీశైలం నిర్వాసితులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.






# ప్రతి గ్రామానికి పశు వైద్యులను నియమించి సేవలందించాలి

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

మండలంలోని పలు గ్రామాల్లో పశువులు, మేకలు, గొర్రెలు, తదితర మూగజీవాలు అనారోగ్యానికి గురై మృతి చెందుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రతి ఏడాది గొర్రెలు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని గ్రామ రైతు ముంత శివ యాదవ్ సోమవారం వనపర్తి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.పశువులకు, గొర్రెలు మేకలకు సకాలంలో వైద్యం అందకపోవడంతోనే అనారోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయని రైతులు పేర్కొన్నారు. మండలంలోని గ్రామాలకు కనీస ప్రాథమిక పశువైద్య సేవలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం వెంటనే వెటర్నరీ వైద్యులను నియమించాలని కోరుతున్నారు.వెటర్నరీ వైద్యులు గ్రామాలను క్రమం తప్పకుండా సందర్శించి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులు, టీకాలు అందించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. పశువుల, గొర్రెలు మేకలపై పై ఆధారపడి జీవిస్తున్న వారి సమస్యలను ప్రభుత్వం దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరారు.



# ఆగస్టు 25న సామూహిక వన మహోత్సవం విజయవంతం చేయాలి

## ప్రతి గ్రామ పంచాయతీలో విస్తృతంగా మొక్కలు నాటాలి: అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**మహబూబ్‌నగర్, ఆగస్టు 24**

**( ప్రజా జ్యోతి బ్యూరో ):**

జిల్లావ్యాప్తంగా ఆగస్టు 25న నిర్వహించనున్న సామూహిక వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ జిల్లా అధికారులు, ఎంపీడీఓలను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వెబెక్స్ సమావేశం ద్వారా జిల్లా అధికారులు, ఎంపీడీఓలతో వన మహోత్సవం ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని, మంగళవారం నిర్వహించే వన మహోత్సవంలో చురుగ్గా పాల్గొనాలని సూచించారు.

**మొక్కలకు జియో ట్యాగింగ్ తప్పనిసరి:**

నాటిన ప్రతి మొక్కకు జియో ట్యాగింగ్ పూర్తి చేసి, అదే రోజు సాయంత్రంలోగా సంబంధిత వెబ్‌సైట్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 50.82 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 27.17 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సంక్షేమ శాఖలు, పరిశ్రమలు, ఫ్యాక్టరీలు, నీటిపారుదల, ఆర్అండ్‌బీ, ఎక్సైజ్, విద్యా సంస్థలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా మొక్కలు నాటాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో భాగస్వాములు కావడంతో పాటు ప్రజాప్రతినిధులను ఆహ్వానించి వారి భాగస్వామ్యంతో కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

**నర్సరీల్లోని మొక్కలను వినియోగించుకోవాలి:**

ప్రతి గ్రామ పంచాయతీ నర్సరీ, అటవీ శాఖ నర్సరీలు, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలోని నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలను వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఎంపీడీఓలు తమ పరిధిలోని గ్రామ పంచాయతీ నర్సరీలను పరిశీలించి, ప్రతి గ్రామ పంచాయతీలో ప్లాంటేషన్ కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇటీవల జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో మొక్కలు నాటేందుకు అనుకూల వాతావరణం ఏర్పడిందని తెలిపారు. రానున్న రెండు మూడు రోజుల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, శాఖల సాధారణ కార్యక్రమాలతో పాటు వన మహోత్సవంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**ప్రజల భాగస్వామ్యంతో మొక్కల సంరక్షణ:**

సర్పంచ్‌లు, స్వచ్ఛంద సంస్థలు, యువత, ప్రజలను భాగస్వామ్యం చేసి విస్తృతంగా మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలని మధుసూదన్ నాయక్ సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు, ఎంపీడీఓలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# "కాంట్రాక్టర్‌గా కాదు.. కూలోడిగానైనా పనిచేశా"

### - కర్నెతండా నీళ్ల క్రెడిట్ కోసం బీఆర్ఎస్ కుస్తీ!

### - "మా బిల్లుల డబ్బులు దోచుకుంది మీరే"

### - జీవోలు ఇచ్చారు.. పనులు ఆపారు: బీఆర్ఎస్‌పై మేఘారెడ్డి ఘాటు విమర్శలు

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):**



కర్నెతండా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని 18 తండాల పరిధిలో 4,235 ఎకరాలకు సాగునీరు అందనుందని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. సోమవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన కర్నెతండా లిఫ్ట్ ఇరిగేషన్ పంపులను ప్రారంభించారు. రూ.87.53 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా వనపర్తి జిల్లాలో 3,384 ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 851 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందని మేఘారెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రూ.87 కోట్లతో జీవో జారీ చేసినప్పటికీ సుమారు రూ.47 కోట్లు ఖర్చు చేసి పనులను మధ్యలోనే నిలిపివేశారని ఆరోపించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిచిపోయిన పనులను దశలవారీగా పూర్తి చేసి ఇప్పటివరకు సుమారు రూ.29 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. భూసేకరణతో పాటు మిగిలిన పనులకు అవసరమైన నిధులు సమకూర్చి ప్రాజెక్టును రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. రైతుల కోసం కూలోడిగానైనా పనిచేశాకర్నెతండా లిఫ్ట్ ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులపై ఎమ్మెల్యే మేఘారెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో ప్రధాన కాలువలను అసంపూర్తిగా వదిలేసి, ప్రాజెక్టుల పేరుతో జీవోలు మంజూరు చేయించుకోవడం తప్ప పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేయలేదని విమర్శించారు. "రైతులకు నీళ్లు అందించాలనే లక్ష్యంతో కాంట్రాక్టర్‌గా కాదు.. అవసరమైతే కూలోడిగానైనా పనిచేశా. పగలు, రాత్రి కష్టపడి కాలువలు తవ్వించాం. కానీ మా బిల్లుల డబ్బులను దోచుకున్నది మీరే" అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. రైతులకు నీరు అందుతున్న విషయం స్పష్టమైన తర్వాత కూడా రాజకీయంగా క్రెడిట్ తీసుకునేందుకు ముందస్తు ప్రెస్‌మీట్లు పెట్టడం సరికాదన్నారు. వనపర్తి జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, ఇప్పటివరకు సుమారు రూ.2,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ సంగ్రామ్‌సింగ్ పాటిల్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయిలపై బీజేపీ పోరుబాట

## బకాయిలు చెల్లించే వరకు ఉద్యమం ఆగదు: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతికుమార్

**హైదరాబాద్/ మహబూబ్ నగర్ ఆగస్టు 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**

తెలంగాణలో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతికుమార్ డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 201920 విద్యా సంవత్సరం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోతున్నాయని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ.8 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని పేర్కొన్నారు.అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు ప్రతి నెలా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిందని, అయితే ఆ హామీ అమలులోనూ జాప్యం జరుగుతోందని శాంతికుమార్ విమర్శించారు. ప్రస్తుతం మొత్తం బకాయిలు దాదాపు రూ.15 వేల కోట్లకు చేరాయని పేర్కొంటూ, మిగిలిన బకాయిల నిధులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.



### హామీలు అమలు చేయాలి:

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని శాంతికుమార్ ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాలని అన్నారు. హామీల అమలుకు ప్రభుత్వం స్పందించకపోతే ప్రజా ఉద్యమాల ద్వారా ఒత్తిడి తీసుకువచ్చి వాటిని అమలు చేయించే బాధ్యతను బీజేపీ తీసుకుంటుందని తెలిపారు. ఉద్యమాలకు అనుమతులు నిరాకరించినా ప్రజాస్వామ్య పద్ధతిలో తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

### విద్యార్థుల తరపున ఉద్యమం ఉధృతం:

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై విద్యార్థుల తరపున బీజేపీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని శాంతికుమార్ ప్రకటించారు. ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు న్యాయం చేసే వరకు పోరాటం కొనసాగుతుందని ఆయన తెలిపారు.

# జర్నలిస్టులకు అండగా రెయిన్ కోట్లు

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

వర్షాకాలంలో గ్రామీణ మారుమూల ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టుల సేవలను గుర్తిస్తూ మండల కేంద్రంలోని ఒకటో అవార్డు మెంబర్ సుబ్రహ్మణ్యం చారి జర్నలిస్టులకు రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఎండ వాన వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితిలను సైతం లెక్కచేయకుండా ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య జర్నలిస్టులు వారధిగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో సైతం వార్తల సేకరణ కోసం గ్రామాలలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను సమాజం దృష్టికి తీసుకు వస్తున్న జర్నలిస్టులకు తన వంతు చిన్న సహకారంగా రెయిన్ అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ రెయిన్ కోట్లు అందజేయడం అభినందనీయమని వర్షాకాలంలో విధులు నిర్వహిస్తున్నందుకు ఇవి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమంలో జర్నలిస్టుల సంఘం ప్రతినిధులు అధికారులు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు



# సురవరం ప్రతాప్‌రెడ్డి పార్కులో ఇతర నిర్మాణాలు చేపట్టొద్దు

## - జిల్లా కలెక్టర్‌కు 22వ వార్డు కౌన్సిలర్ అరుణ శ్రీనివాసులు వినతి

**వనపర్తి, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి):**

పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న సురవరం ప్రతాప్‌రెడ్డి పార్కులో నిబంధనలకు విరుద్ధంగా ఇతర నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని 22వ వార్డు కౌన్సిలర్ ఏర్వ అరుణ శ్రీనివాసులు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వనపర్తి తొలి ఎమ్మెల్యే సురవరం ప్రతాప్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసి, అందుబాటులో ఉన్న స్థలంలో పార్కును అభివృద్ధి చేసినట్లు కౌన్సిలర్ తెలిపారు. పార్కు ఏర్పాటుకు సంబంధించి 2020 సెప్టెంబరు 30న అప్పటి మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. పార్కు ముందు భాగంలో బస్ షెల్టర్ ఉండటంతో ప్రయాణికులు సేదతీరేందుకు, స్థానిక ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు ఇది ఉపయోగపడుతోందన్నారు. అయితే నిబంధనలను పక్కనపెట్టి పార్కు స్థలంలో ఇతర నిర్మాణాలు చేపట్టేందుకు అధికార పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని, దీనిని వార్డు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని అరుణ శ్రీనివాసులు పేర్కొన్నారు. సురవరం ప్రతాప్‌రెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన పార్కు ప్రస్తుత రూపంలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం ప్రతిని వినతిపత్రానికి జత చేసినట్లు ఆమె తెలిపారు.



# రైతుల నుంచి ఎకరాకు రూ.500 వసూళ్లా? లిఫ్ట్ మరమ్మతులు ప్రభుత్వమే చేపట్టాలి

- సిల్ట్ అమ్మగా వచ్చిన రూ.2 కోట్లు ఏమయ్యాయి?
- స్కూల్లో రాజకీయ పాటలేంటి? కస్తూర్బా ఘటనపై విచారణ జరపాలి: చిన్న మల్లయ్య
- కస్తూర్బా స్కూల్లో రాజకీయ పాటలకు విద్యార్థినుల డ్యాన్సులపై విచారణ జరపాలి

**చిన్నంబావి ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండల పరిధిలోని చిన్నమారూరు ఎత్తిపోతల పథకం వ్యవహారంపై బీజేపీ రాష్ట్ర నాయకుడు కురువ చిన్న మల్లయ్య ప్రభుత్వాన్ని నిలదీశారు. లిఫ్ట్‌లోని సిల్ట్‌ను టెండర్ ద్వారా విక్రయించగా వచ్చిన రూ.2 కోట్ల ఆదాయం ఏమైందని ప్రశ్నించారు. ఆ నిధులకు సంబంధించిన పూర్తి లెక్కలను ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. అవినీతికి తావులేదని చెబుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు.. రూ.2 కోట్ల వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. సోమవారం చిన్నంబావి మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.రైతులపై భారం మోపొద్దుఎత్తిపోతల పథకం మరమ్మతులకు భారీగా నిధులు అవసరమని చెబుతూ రైతుల నుంచి ఎకరాకు రూ.500 చొప్పున వసూలు చేయడం సరికాదన్నారు. వర్షాలు లేక పంటలు పండక ఇబ్బందులు పడుతున్న రైతులపై మరో భారం మోపడం బాధాకరమన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల మరమ్మతు, నిర్వహణ బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రైతుల నుంచి డబ్బులు వసూలు చేయకుండా ప్రభుత్వమే నిధులు సమకూర్చి పథకాలను మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు.సిల్ట్ విక్రయం ద్వారా వచ్చిన రూ.2 కోట్లను ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. రూ.2 కోట్లు ఎక్కడ ఖర్చు చేశారు? ఎవరి అనుమతులతో ఖర్చు చేశారు? చేసిన పనుల వివరాలేంటి? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిధుల వినియోగంపై సమగ్ర లెక్కలు చూపాలని డిమాండ్ చేశారు.

### స్కూల్లో రాజకీయ పాటలేంటి?

మంత్రి జూపల్లి కృష్ణారావు కస్తూర్బా పాఠశాలను సందర్శించిన సమయంలో పాఠశాల ఆవరణలో గత ఎన్నికల ప్రచార పాటలు పెట్టి విద్యార్థినులతో డ్యాన్సులు చేయించారని చిన్న మల్లయ్య ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలలను రాజకీయ ప్రచారానికి వేదికలుగా మార్చడం సరికాదన్నారు. చదువుకోవడానికి



వచ్చిన విద్యార్థినులతో రాజకీయ నాయకుల ఎన్నికల ప్రచార పాటలకు నృత్యాలు చేయించడం ఏమిటని ప్రశ్నించారు.ఈ ఘటనపై ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు.అయితే కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్ల సమస్యపై మంత్రి స్పందించి చర్యలు తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. సమస్యపై స్పందించినందుకు మంత్రికి కృతజ్ఞతలు చెప్పారు.పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు కల్పించాలని కోరారు.రోడ్ల దిగ్బంధమేంటి? అధికార పార్టీ కార్యక్రమం కోసం చిన్నంబావి నాలుగు రోడ్ల కూడలిని మూసివేయడంతో ప్రజలు,వాహనదారులు ఇబ్బందులు పడ్డారని చిన్న మల్లయ్య మండిపడ్డారు. ప్రజల రాకపోకలకు ఆటంకం కలిగించేలా రోడ్లపై సభలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అధికార పార్టీ కార్యక్రమాలను విశాలమైన ప్రదేశాల్లో నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వ అధికారులు సైతం ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు గణేష్ రెడ్డి,కోళ్ళ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు

# మిలాద్ ఉన్ నబీ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలి: రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 24( ప్రజా జ్యోతి)**

నారాయణపేట మండలం కొల్లంపల్లి గ్రామంలో ముస్లిం మత పెద్దలతో నారాయణపేట రూరల్ ఎస్సై సతీష్ రెడ్డి శాంతి సమావేశం నిర్వహించారు. రానున్న మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా నిర్వహించే ర్యాలీని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్సై సతీష్ రెడ్డి మాట్లాడుతూ... పండుగ ర్యాలీ సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రజల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ర్యాలీలో పాల్గొనే మత పెద్దలు, నిర్వాహకులు పోలీసులకు పూర్తిగా సహకరించాలని కోరారు.ర్యాలీ సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పోలీసుల సూచనలు పాటించాలని తెలిపారు. ర్యాలీలో పాల్గొనే ప్రతి ఒక్కరూ శాంతియుతంగా వ్యవహరిస్తూ, ఎలాంటి వివాదాలకు అవకాశం లేకుండా పండుగను సోదరభావంతో నిర్వహించుకోవాలని సూచించారు.అలాగే సామాజిక మాధ్యమాల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా, ఇతరుల మనోభావాలను దెబ్బతీసేలా లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎలాంటి అనుచిత పోస్టులు, వీడియోలు, వ్యాఖ్యలు చేయరాదని హెచ్చరించారు. ఇతరులు చేసిన అభ్యంతరకరమైన పోస్టులను షేర్ చేయడం, ఫార్వర్డ్ చేయడం కూడా చేయరాదని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని నమ్మకుండా, అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని కోరారు.పండుగ సందర్భంగా గ్రామంలో మత సామరస్యం, సోదరభావం, శాంతి భద్రతలు కొనసాగేందుకు మత పెద్దలు, యువత మరియు గ్రామ ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్సై కోరారు.



# మిలాద్ ఉన్ నబి పండుగ సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు

## - పోలీస్ సంఘం ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి.

## - లాంగ్ పెండింగ్ కేసులపై ప్రత్యేక సమీక్ష. - జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 24**

**( ప్రజా జ్యోతి)**











నారాయణపేట జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ×గా పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మిలాద్ ఉన్ నబి బందోబస్తు ఏర్పాట్లు మరియు పోలీస్ సంఘం ఎన్నికలు, లాంగ్ పెండింగ్ కేసులపై సమీక్షించారు. సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...బుధవారం రోజు జరిగే మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా జిల్లా పరిధిలో ముందస్తు శాంతి మత పెద్దలు, ఇతర శాఖ అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి శాంతియుతంగా పండుగ జరుపుకునే విధంగా చూడాలని అలాగే జెండాలు కట్టే సమయంలో మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకొని జెండాలను ఏర్పాటు చేసుకునేలా చూడాలని ఎలాంటి ఘర్షణలకు తావు లేకుండా చూడాలని, మిలాద్ ఉన్ నబీ ర్యాలీలకు ముందస్తు పర్మిషన్ తీసుకునేలా చూడాలని, ప్రార్థన మందిరాల వద్ద ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ర్యాలీ నిర్వహించి ప్రధాన మార్గాన సీసీ కెమెరాల నిఘా ఉంచాలని, డ్రోన్ కెమెరాలు, వీడియోగ్రఫీతో రికార్డు చేయాలని, ప్రధాన చౌరస్తాల వద్ద పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేయాలని, ర్యాలీ నలువైపులా బందోబస్తు ఉండాలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రజల భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ పోలీసుల ప్రధాన బాధ్యత అని ప్రతి అధికారి సిబ్బంది సమన్వయంతో పనిచేసి పండుగ ప్రశాంతంగా నిర్వహించేలా కృషి చేయాలని ఎస్పీ సూచించారు.

### పోలీస్ సంఘం ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి.

జిల్లా పరిధిలో మంగళవారం రోజు జరిగే పోలీస్ సంఘం ఎన్నికలు పారదర్శకంగా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారి ఐజ=దీ డీఎస్పీ మహేష్, అదనపు ఎస్పీ వీణ రియాజ్ హుల్ హక్, సీఐ లకు ఆదేశించారు. పోలీసు సంఘం ఎన్నికలు సర్కిల్ పోలీస్ స్టేషన్లో సర్కిల్ వారిగా నిర్వహించాలని మిగతా విభాగాలకు హెడ్ క్వాటర్స్, జిల్లా కాన్ఫరెన్స్ హాల్లో ఎన్నికలు నిర్వహించాలని, ఎన్నికలు సీసీ కెమెరా నిఘాలో నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. ఎన్నికల రోజు అందరూ యూనిఫాంలోనే ×ఐ కార్డ్ తో రావాలని, బయట డ్యూటీలో ఉన్న పోలీసులకు వాట్సాప్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఉదయం 8:00 గంటల నుండి 2:00 గంటల వరకు ఎన్నికలను నిర్వహించి అనంతరం బ్యాలెట్ బాక్స్ లు ఎస్పీ కార్యాలయంలోనీ కౌంటింగ్ కేంద్రం వద్ద కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడించాలని సూచించారు.డిజిపి ఆఫ్ ఇయర్లీ క్రైమ్ రివ్యూ మీటింగ్ కు అధికారులు అందరూ తగిన రిపోర్ట్స్ తో సన్నద్ధం కావాలని తెలిపారు. అలాగే జిల్లాలో లాంగ్ పెండింగ్ కేసులను, ప్రాపర్టీ దొంగతనం కేసులు, డీజీపీ ఆఫ్ ఇయర్లీ క్రైమ్ రివ్యూ సమావేశానికి అధికారులు అందరూ తమ పరిధిలోని నేరాలు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు తదితర అంశాలపై సమగ్ర నివేదికలతో సన్నద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. జిల్లాలోని లాంగ్ పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రాపర్టీ దొంగతనం కేసుల్లో నేరస్తులను గుర్తించి, దొంగిలించిన ఆస్తులను రికవరీ చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.జజుఎలు, సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా వినియోగిస్తూ నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, పోలీస్ అధికారులు తమ పరిధిలోని కేసులపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఎస్పీ సూచించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ వీణ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ మహేష్, సీఐ లు శివ శంకర్, రామ్ లాల్, భగవంత్ రెడ్డి, సైదులు, ఎస్ఐ లు వెంకటేశ్వర్లు సతీష్ రెడ్డి, నరేష్, విజయ్ కుమార్, రాజు, రమేష్, ాావీ నవీద్, అశోక్ బాబు, గాయత్రి, రేవతి తది తరులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## తెలంగాణ రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి. జూపల్లి కృష్ణారావు

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.**

తెలంగాణ రాష్ట్రంలో ప్రతి గ్రామంలో బీటీ రోడ్లు నిర్మించడమే ప్రధాన లక్ష్యమని మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి. జూపల్లి కృష్ణారావు అన్నారు వీపనగండ్ల మండల కేంద్రం నుండి కేతపల్లి వరకు డబల్ రోడ్డు నిర్మాణం కొరకు సుమారు 30 కోట్ల ఒక్క లక్ష రూపాయలతో డబల్ రోడ్డు నిర్మాణానికి సోమవారం నాడు భూమి పూజ చేశారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ దెయ్యం తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రధాన లక్ష్యమని మంత్రులు అన్నారు.కొల్లాపూర్ నియోజకవర్గంలో ఉన్న ప్రతి గ్రామానికి రోడ్డు నిర్మాణాలు చేపడతామని రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు







# పోలీస్ ప్రజావాణికి రెండు వినతులు

## -ప్రజావాణి వినతులను చట్టప్రకారం పరిష్కరించాలి

## -ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్

**నాగర్ కర్నూల్ : ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)**

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ ప్రజా వాణిలో ఫిర్యాదు దారుల నుండి 02 ఫిర్యాదులను జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ స్వీకిరించారు.ఈ సందర్బంగా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులను ఆదేశించారు.ప్రజావాణిలో ఫిర్యాదు లలో 1 భూమికి సంబంధించిన అర్జీ,కాగా 1 తగు న్యాయం సంబంధించినదిగా అధికారులు తెలిపారు. స్వీకరించి అర్జీలను తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ లకు పరిష్కారనిమిత్తం పంపుతున్నట్లు ఎస్పి తెలిపారు.అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకోవాలని,ప్రజలు తమ సమస్యలు చట్టప్రకారం పరిష్కరించుకునేలా పోలీసులు ప్రజలకు మరింత దగ్గరై శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలియజేశారు.




మొదటిపేజీ తరువాయి

# రవాణా సౌకర్యాల పై ప్రత్యేక దృష్టి

## మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు

**నాగర్ కర్నూల్ ఆగస్టు 24 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

రవాణా సౌకర్యాలపై ప్రత్యేకంగా నిధులు కేటాయించి ప్రత్యేక దృష్టి సారించామని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. సోమవారం పర్యటనలో భాగంగా రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి తో కలిసి అచ్చంపేట నియోజకవర్గంలో 146. 71 కోట్ల వ్యయంతో రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రహదారుల కొరకు ప్రత్యేక నిధులు కేటాయించి, రహదారుల వెడల్పుకి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి వ్యాఖ్యానించారు. అదేవిధంగా బుల్లెట్ రైల్, ఎలివేటెడ్ కారిడార్ తో నల్లమల్ల రూపురేఖలు మారానున్నాయని మంత్రి స్పష్టం చేశారు. అచ్చంపేట ప్రాంతం ప్రత్యేక ప్యాకేజీలతో అభివృద్ధి కానుందని సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరా గుంటకు సాగునీళ్లు అందించడమే తమ లక్ష్యమన్నారు. రాబోయే రోజుల్లో లక్ష రూపాయల కోట్లు వేచించి బుల్లెట్ ట్రైన్ పరుగులు తీసే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి, స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి మల్లేష్ రజిత, గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, వివిధ శాఖల అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు



# ఆగస్టు 25న,భారీ వన మహోత్సవం - జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటాలి

## - అధికారులు.ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి - కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 24 (ప్రజా జ్యోతి)**





నాగర్ కర్నూల్ జిల్లా పచ్చదనంతో నింపే లక్ష్యంతో ఆగస్టు 25న,జిల్లా వ్యాప్తంగా భారీ స్థాయిలో వన మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రతి గ్రామపంచాయతీలో ప్రజాప్రతినిధులు,అధికారులు,ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని కలెక్టర్ అన్నారు.వన మహోత్సవం కార్యక్రమం నిర్వహణపై సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకర వాతావరణం అందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరముందని,ఈ నెల 25న,నిర్వహించే వనమహోత్సవాన్ని ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని,జిల్లా లోని ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో మొక్కలునాటే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టాలని,గ్రామాలలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలు,పాఠశాలలు,ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలు,రహదారుల వెంట,ఇతర అనవైన ప్రదేశాలను గుర్తించి మొక్కలను నాటాలని సూచించారు.మొక్కలు నాటడంతోనే కార్యక్రమం పూర్తయినట్లు భావించకుండా,మొక్కల సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. నాటిన మొక్కలు ఎండిపో కుండా నీటి వసతి,రక్షణ, సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.గ్రామ స్థాయిలోనే కాకుండా మండల, నియోజకవర్గ స్థాయిలోనూ వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు,ప్రజాప్రతినిధులను కార్యక్రమాలకు ఆహ్వానించి వారి భాగస్వామ్యంతో కార్యక్రమాన్ని నిర్వహించి విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు,అధికారులు,విద్యార్థులు,యువ త,స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజలను భాగస్వాములను చేయడంతో వన మహోత్సవంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని, వ్యవసాయం, విద్య, వైద్యం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి తదితర ప్రభుత్వ శాఖలు తమ పరిధిలో క్షేత్రస్థాయిలో మొక్కలునాటే కార్యక్రమాన్ని చేపట్టాలని,నిర్దేశించిన ప్రాంతాల్లో మొక్కలు నాటేలా కార్యా చరణ రూపొందించుకోవాలని,సంబంధిత అధికారులు కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించాలని, శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో కార్యక్రమాల అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని పెరుగుతున్న కాలుష్యం,వాతావరణ మార్పుల నేపథ్యంలో పచ్చదనాన్ని పెంపొందించడం అందరి బాధ్యత అని,మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు మెరుగైన జీవన వాతావరణాన్ని అందించవచ్చని,మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించే బాధ్యతతీసుకోవాలన్నారు. గ్రామ,మండల,నియోజకవర్గస్థాయిలో ప్రతి శాఖ ద్వారా నిర్వహించే వన మహోత్సవ కార్యక్రమాల పూర్తి వివరాలను జిల్లా స్థాయికి అందించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చెన్నయ్య,ఆర్.డి.ఓ బన్సీలాల్,తహసీల్దార్లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామీణ స్థాయి నుంచే హక్కుల పోరాటం

## - చదువుకున్న యువతతో గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలి

**చిన్నంబావి, ఆగస్టు 24 (ప్రజాజ్యోతి)**





ప్రజా సమస్యలపై బలమైన పోరాటాలు నిర్మిస్తూ అణగారిన వర్గాల హక్కుల సాధనకు ఉద్యమించాలని ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా ఇన్చార్జి కొమ్మువారి మస్తాన్ మాదిగ అన్నారు. కుల వివక్ష, సామాజిక అసమానతలు లేని సమసమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.చిన్నంబావి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ హాల్లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం మండల ఇన్చార్జి దేవని రమేష్ మాదిగ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మస్తాన్ మాదిగ మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచే చదువుకున్న యువతతో నిర్మించాలని సూచించారు.దేశంలో కుల వ్యవస్థ కొనసాగుతున్నందునే అణగారిన వర్గాలు పేదరికంలో మగ్గుతున్నాయని అన్నారు. పేదరికం, వివక్షకు కారణమైన కుల వ్యవస్థను రద్దు చేసి దోపిడీ, పీడన, అసమానతలు లేని సమాజం కోసం పోరాడాలని కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిపై ప్రజా ఉద్యమాలను నిర్మించాలని సూచించారు.గ్రామ కమిటీల ఏర్పాటుపై నాయకులు ప్రత్యేక దృష్టి సారించాలని, సెప్టెంబర్ 5లోగా గ్రామ, మండల కమిటీల నిర్మాణాన్ని పూర్తి చేయాలని తెలిపారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేని చదువుకున్న యువతను కమిటీల్లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. సెప్టెంబర్ 9న వరంగల్లో జరిగే ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ మండల కమిటీల జాతీయ మహాసభకు అన్ని మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గంధం గట్టయ్య మాదిగ, కొమ్ము చెన్నకేశవులు మాదిగ, మీసాల నాగరాజు మాదిగ, మొలకలపల్లి పరుశురాముడు మాదిగ, మీసాల గణేష్ మాదిగ, కత్తి కురుమూర్తి మాదిగ, వడ్డేమాన్ రామకృష్ణ మాదిగ, తారం కాన్షీరాం మాదిగ, నీరటి సహదేవుడు మాదిగ, దేవని మహేష్‌బాబు మాదిగ, తారన్ గోపి మాదిగ, బండారి వెంకటేష్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలి

## - రాష్ట్ర పన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

## - గ్రామ సభలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

## - జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్





**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 24 (ప్రజా జ్యోతి)**

ఆగస్టు 27న,రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామసభలు,వార్డు సభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి జిల్లాల ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం ఎస్.ఐ.ఆర్ ప్రక్రియపై జిల్లాల లెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో రాష్ట్ర పధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ లో సమీక్ష నిర్వహించారు.నాగర్ కర్నూల్ జిల్లా కలెక్ట రేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సమావేశంలో పాల్గొన్నా రు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికా రి మాట్లాడుతూ ఆగస్టు 27న, పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ,వార్డు సభలు నిర్వహించాలని గ్రా మీణ ప్రాంతాల్లో సంబంధిత గ్రామ పంచాయతీ భవనాలలో,పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రంలో సభలు నిర్వహించాలని,సంబంధిత బీఎల్‌ఓలు, బిఎల్ఏ లు గ్రామ సభలలో పాల్గొనేలా చర్యలు సుకోవాలన్నారు.అనామోలీస్,మ్యాపింగ్ కానీ ఓటర్లకు సంబంధించిన వివరాలు బూత్ స్థాయి అధికారుల ద్వారా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందించాలని,పెండింగ్ లో ఉన్న నోటీసుల జనరేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేసి నోటీసులు అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా నో టీసుల జనరేషన్ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేస్తున్నామని,27న, నిర్వహించే గ్రామ,వార్డు సభ లను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని,జిల్లాలోని మూడు నియోజక వర్గాలవారీగా అర్హతఉన్న ప్రతిఓటరు ఓటు హక్కును పరిరక్షించే విధంగా ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్ని కల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా,పకడ్బందీగా పూర్తి చేస్తామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఎన్నికల అధికారులతో మాట్లాడుతూ గ్రామ సభలు,వార్డు సభల నిర్వహణపై బీఎల్‌ఓల ద్వారా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సభల వద్ద ఫారం-6, ఫారం-7,ఫారం-8 తో పాటు అవసరమైన ఫారాలను సిద్ధంగా ఉంచాలని గ్రామ, వార్డు సభల్లో బీఎల్‌ఓలు డ్రాఫ్ట్ జాబితాలోని ఓటర్ల పేర్లను చదివి వినిపించాలని,జాబితాలో పేరు లేక అర్హత కలిగిన భారతీయ పౌరులను గుర్తించాలని, అక్టోబర్ 01.2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే వారు ఫారం -6 తో పాటు డిక్లరేషన్ ఫారం, అవసరమైన ఆధారాలను ఇచ్చి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా ప్రజలకు అవగాహ న కల్పించాలని,డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు లేదా ఇతర వివరాల్లో తప్పులు,వ్యత్యాసాలు ఉన్నట్లయితే ఫారం -8 ద్వారా సవరణలకు దరఖాస్తు చేసుకునేలా వివరించాలని,సంబంధించిన వివరాలు బూత్ స్థాయి అధికారులతో గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులకు అందించాలని,పెండింగ్ లో ఉన్న నోటీసుల జనరేషన్ ప్రక్రియ త్వరగా పూర్తిచేసి నోటీసులు అందించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్(రెవెన్యూ)చెన్నయ్య, జిల్లా ఎన్నికల అధికారులు, ఆర్డీఓలు, ఎం.ఆర్.ఓలు తదితరులు పాల్గొన్నారు.

---

# ప్రతి రైతు వివరాలు DCS యాప్‌లో నమోదు చేయాలి



**ప్రజాజ్యోతి గండీడ్:**

వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందుతున్న పథకాలు, సేవలను సమర్థవంతంగా అందించేందుకు రైతుల వివరాలను ఐజూ యాప్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులు సూచించారు. ప్రతి రైతు తనకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులను సంప్రదించాలని తెలిపారు.రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ సంబంధిత సేవలు అర్హులైన రైతులకు చేరేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో రైతులక్ష_తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు.

# చిన్నంబావిలో మంత్రుల సుడిగాలి పర్యటన

-రూ.84.60 కోట్లతో రెండు రహదారులకు శంకుస్థాపన చేశారు

కొల్లాపూర్ నియోజకవర్గానికి రూ.330 కోట్లతో అభివృద్ధి పనులు

డబుల్ బీటీ రోడ్లకు భూమిపూజ చేసిన మంత్రులు జూపల్లి, కోమటిరెడ్డి

చిన్నంబావిలో రూ.2 కోట్లతో సమావేశ మందిరం..

6 ఎకరాల భూమిని ప్రజా అవసరాలకు ఉచితంగా అందించిన మంత్రి జూపల్లి

**చిన్నంబావి, ఆగస్టు 24 (ప్రజా జ్యోతి)**

చిడంబావి మండల కేంద్రంలోని మంత్రుల సుడిగాలి పర్యటన నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రహదారుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన భవనాల నిర్మాణానికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. సోమవారం చిన్నంబావి మండలంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవితో కలిసి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు.

## రూ.330 కోట్లతో అభివృద్ధి పనులు

కొల్లాపూర్ నియోజకవర్గానికి ఇటీవల సుమారు రూ.330 కోట్ల నిధులు కేటాయించి వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అభివృద్ధి పనుల కోసం సుమారు రూ.3 వేల కోట్ల వరకు నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు.

## డబుల్ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

చిన్నంబావి మండలంలోని పలు గ్రామాలను కలుపుతూ డబుల్ బీటీ రోడ్ల నిర్మాణానికి భారీగా నిధులు మంజూరు చేసినట్లు మంత్రులు తెలిపారు. పెద్దదగడ గ్రామపంచాయతీ నుంచి గూడెం, బెక్కెం,గడ్డబసాపూర్, మియాపూర్, వెలగొండ మీదుగా వెళ్లే రహదారి అభివృద్ధికి రూ.45 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే చెల్లెపాడు నుంచి చిన్నంబావి వరకు సుమారు రూ.39 కోట్లతో డబుల్ రోడ్డు శంకుస్థాపన చేశారు

ఈ రోడ్లు పూర్తయితే ఆయా గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రహదారులు కీలకమని, దశలవారీగా అన్ని గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

## చిన్నంబావిలో రూ.2 కోట్లతో సమావేశ మందిరం

చిన్నంబావి మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రజా సమావేశాలు నిర్వహించేందుకు అనువైన భవనం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించినట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రంలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో సమావేశ మందిరం నిర్మించేందుకు నిధులు కేటాయించినట్లు చెప్పారు. ఈ భవనం అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.చిన్నంబావి మండలంలో ప్రజా అవసరాల కోసం మంత్రి జూపల్లి కృష్ణారావు తనకు చెందిన ఆరు ఎకరాల భూమిని ఉచితంగా అందించినట్లు కార్యక్రమంలో వెల్లడించారు. ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధి కోసం తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని మంత్రి తెలిపారు.

## ప్రతి సమస్యను పరిష్కరిస్తాం

ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, రేషన్ కార్డులు తదితర సమస్యలపై అర్హులైన ప్రజలు తమ దృష్టికి తీసుకురావాలని మంత్రులు సూచించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు








తీసుకుంటామని భరోసా ఇచ్చారు. రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తీసుకొచ్చి కొల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, మాజీ జెడ్పీటీసీ కృష్ణ ప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్ యాదవ్, కొత్త కళ్యాణ్‌రామ్, శ్రీలతారెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఆదర్శ్‌గౌడ్, బీచుపల్లి యాదవ్, తేజారెడ్డి, సర్పంచులు భాస్కర్ తదితరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

